క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నడిగూడెం : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ నడిగూడెం ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ కె.సైదయ్య బుధవారం తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు అందుకు వినియోగదారులు సహకరించాలన్నారు.

భూ భారతిపై రేపు అవగాహన సదస్సు

నడిగూడెం : మండల కేంద్రంలో శుక్రవారం 11గంటలకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వి.సరిత బుధవారం తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ హాజరు కానున్నట్లు ఆమె తెలిపారు. సదస్సులో మండల రైతులు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

మునగాల : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న భూ భారతి చట్టం-2025పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఈ సదస్సుకు కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే పద్మావతి హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ అవగాహన సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు, మీడియా మిత్రులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యువత లక్ష్యంవైపు పయనించాలి



నవీన్‌ను సన్మానిస్తున్న సీఐ

హుజూర్‌నగర్ : యువత మంచిగా చదివి ఉన్నత లక్ష్యం వైపు పయనించాలని సీఐ చరమందరాజు అన్నారు. గ్రూప్- 1లో 471 మార్కులతో 210ర్యాంక్ సాధించిన పట్టణానికి చెందిన యరగాని నవీన్‌ను బుధవారం సీఐ కార్యాలయంలో శాలువా కప్పి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. నవీన్ ఉద్యోగం చేసుకుంటూ పట్టుదలతో చదివి గ్రూప్-1లో మంచి ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. ప్రతి యువకుడు నిర్దిష్టమైన లక్ష్యం పెట్టుకొని, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీకౌన్సిలర్ గురవయ్య ఉన్నారు.

ఆస్పత్రిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న క్లబ్ సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన గుండా శ్రీనివాసరావు – జ్యోతి కుమార్తె మహతి జన్మదినం సందర్భంగా బుధవారం వాసవీ క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో 200మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ అమృత, వాసవీ క్లబ్, వనితా క్లబ్ సభ్యులు కె.పాపారావు, వి.వెంకటేశ్వర్లు, యు.వెంకటేశ్వర్లు, పి.ఝాన్సీరాణి, ప్రవళిక, లీల, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, శృతి, మౌనిక, శోభరాణి, నిత్యశ్రీ, మంగమ్మ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవం



మహోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

మునగాల : మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడెంలో బుధవారం నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో వారిని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డి.విజయనాయక్‌ను సన్మానించి మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచే ఎందుకు కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జాన్‌పాషా, శ్రీధర్, కృష్ణ, మహేష్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సీసీవేశారు.. మట్టి మరిచారు

- సీసీరోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న మార్జిన్
- మట్టిపోయకుండా వదిలేయడంతో ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



సీసీరోడ్డు వెంట మట్టిపోయకుండా వదలివేసిన మార్జిన్



సీసీరోడ్డుపై ఉన్న ప్రమాదకర మూలమలుపు

మునగాల : రూ.కోట్లు వెచ్చించి సిమెంట్ రోడ్లు వేశారు.. కానీ ఆ రోడ్డు వెంట మార్జిన్లకు మట్టి పోయకుండా వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల కేంద్రం నుంచి గరిడేపల్లి మండలం కీతవారిగూడెం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ బీటీరోడ్డును రూ.10కోట్లతో డబుల్‌రోడ్డుగా ఏర్పాటు చేసే క్రమంలో మండల కేంద్రంలో 800మీటర్ల పొడవులో సీసీరోడ్డు నిర్మాణం చేశారు. కాని కాంట్రాక్టర్ ఇరుపక్కల మార్జిన్ వెంట మట్టి పోయకుండా వదలివేయడంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు రోడ్డు కిందకు దిగి మళ్లీ వాహనాలతో ఎక్కే సమయంలో కిందపడి గాయాలపాలవుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం మూడు మండలాలకు చెందిన వందలాది మంది ప్రయాణిస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా మార్జిన్ వెంట మట్టిపోయాల్సి ఉండగా ఇంతవరకు పోయలేదు. ఫలితంగా రోడ్డు దిగాలంటే వాహనదారులు జంకుతున్నారు. దీంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై పలువురు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెంటనే మార్జిన్ వెంట మట్టిపోయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి..

మండల కేంద్రంలో గణపవరం వెళ్లే రహదారిలో ఇటీవల నూతనంగా సీసీరోడ్డు నిర్మాణం జరిగింది. 800మీటర్ల పొడవుతో ఏడు మీటర్ల వెడల్పుతో నిర్మించిన సీసీరోడ్డుపై ఆయా చోట్ల ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుతో పాటు మోడల్‌స్కూల్ ఎదురుగా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కాని సదరు కాంట్రాక్టర్ ఈ రెండు చోట్ల స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. ఈ రహదారిపై నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. అంతే కాకుండా మూడు మండలాల పరిధిలోని సుమారు 8గ్రామాల ప్రజలు ఈ రహదారి గుండా నిత్యం ప్రయాణిస్తుంటారు. స్పీడుబ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు.

రోడ్డుకు ఇరుపక్కలా మట్టిపోయించాలి



ఇటీవల నిర్మించిన సీసీరోడ్డు వెంట సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ యుద్ధప్రాతిపదికన మట్టి పోయించి స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. మార్జిన్‌వెంట మట్టి పోయకపోవడం, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

– చింతకాయల నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మునగాల

త్వరలో మట్టి పోయిస్తాం

మండల కేంద్రంలో ఇటీవల రూ.10కోట్లతో సుమారు 800మీటర్ల పొడవు, ఏడుమీటర్ల వెడల్పుతో సీసీరోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇరుపక్కల మార్జిన్ వెంట మట్టిపోయాల్సి ఉంది. ప్రస్తుతం మట్టి దొరక్కపోవడంతో కాంట్రాక్టర్ ఆలస్యం చేస్తున్నాడు. వీలైనంత త్వరలో ఇరుపక్కల మట్టిపోయించి సమస్యను పరిష్కరిస్తాం.

– బి.సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఏఈ, మునగాల

పౌరులు చట్టానికి లోబడి నడుచుకోవాలి

- ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి

మునగాల : గ్రామాలలో పౌరులు చట్టాలకు లోబడి నడుచుకోవాలని, క్షణికావేశం, సంతోషం కోసం నేరాలకు పాల్పడి జీవితాలను జైలుపాలు చేసుకోవద్దని ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి కోరారు. పోలీసు ప్రజాభరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి మండలంలోని నరసింహాపురంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీసులు ప్రజల భద్రత, రక్షణ కోసం అనుక్షణం పనిచేస్తున్నారని, పోలీసు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామానికి మంచిపేరు తేవడానికి ప్రతిఒక్కరూ మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. ప్రతి గ్రామచరిత్ర పోలీసు రికార్డులలో నమోదు చేయబడి ఉంటుందని, గ్రామంలో ఏమైనా చెడు సంఘటనలపై పోలీస్‌స్టేషన్‌లో నమోదైతే గ్రామం సమస్యాత్మక గ్రామంగా ఉంటుందని, తద్వార గ్రామాభివృద్ధి వెనుకబడుతుందన్నారు. సైబర్ నేరాలు, మోసాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామంలో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు, యువత కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునగాల సీఐ బి.రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

చిలుకూరు : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-4లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షంలో భాగంగా బుధవారం గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సునిత మాట్లాడారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, అంగన్‌వాడీ టీచర్ కవిత, ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ పంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో బుధవారం కోదాడ పట్టణానికి చెందిన మారగాని నాగరాజు – ఉష దంపతుల కుమారుడు మరగాని జీవన్ జన్మదినం సందర్భంగా అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు వేమూరి సత్యనారాయణ, నాగరాజు మిత్రులు గోపినాథ్, ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

‘భూ భారతి’తో రైతులకు న్యాయమైన సేవలు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

మఠంపల్లి : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో సులభతరమైన న్యాయమైన ఉచిత సేవలు అందుతాయని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో భూ భారతి చట్టం -2025 పై రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భూ భారతి చట్టంతో బహుళ ప్రయోజనాలు కలుగనున్నాయన్నారు. ముఖ్యంగా గతంలో ధరణి కార్యక్రమంలో రైతులు ఎదుర్కొన్న సమస్యలను అధిగమించి దరఖాస్తులు చేసుకునే సౌకర్యం కల్పించడంతో పాటు ఆ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం మార్పులు చేర్పులు వికేంద్రీకరణ చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆదేశానుసారం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం క్షేత్రస్థాయిలో గ్రామ పరిపాలన అధికారులు, మండల స్థాయిలో సర్వేయర్లను నియమించడం కోసం చర్యలు చేపట్టిందన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో నూతన రికార్డుల నిర్వహణ సులభతరంగా ఉంటుందన్నారు. సదస్సుకు హాజరైన పలువురు రైతులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. అంతేగాక ఎలాంటి సమస్యలున్నా గ్రామ సభల్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ ఎల్.మంగా రాథోడ్, సీఐ గజ్జి చరమందరాజు, ఎంపీడీఓ జగదీష్‌కుమార్, డీటీ బాలరాజు, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ బాబునాయక్, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

- మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

చిలుకూరు : ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు పార్టీ నాయకులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం చారిత్రాత్మకంగా నిలిచిపోతుందన్నారు. మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. నేడు కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి కుంట పడిందని, వాటిని పార్టీ రజతోత్సవ సభలో ఎండగడుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అక్కినపల్లి జానకీరామాచారి, అంబాల రాంబాబు, మాజీ ఎంపీపీ కొండా అన్నపూర్ణ, చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్, పార్టీ నాయకులు కస్తూరి నర్సయ్య, తాళ్లూరి శ్రీను, జానిమియా, కడియాల వెంకటేశ్వర్లు, కుర్రా అచ్చయ్య, షేక్ పాషా, ములుగూరి నాగరాజు, వెంకటయ్య, అల్లి ఉపేందర్, కాశయ్య, శ్రీను, లింగరాజు, పంతులు, యాదగిరి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతో పార్టీ బలాన్ని పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

హుజూర్‌నగర్ : ప్రజా పోరాటాలతోనే పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని అమరవీరుల భవన్‌లో సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రానున్న మూడేళ్ల కాలంలో పార్టీ 15అంశాలు తీసుకొని ప్రజల్లోకి వెళ్లి క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలన్నారు. ఇటీవల జరిగిన అఖిలభారత మహాసభ ఈ మేరకు నిర్ణయాలు చేసిందన్నారు. మతోన్మాదాన్ని ఎదుర్కొనేందుకు సెక్యులర్ శక్తులను ఐక్యం చేయాలన్నారు. దేశంలో బీజేపీ మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకే భాష, ఒకే మతం, ఒక ఎన్నిక ఉండాలని బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ కలలు కంటున్నాయని, వారి ఆటలు ఈ దేశంలో సాగవన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నాయకులు నాగారపు పాండు, దుగ్గి బ్రహ్మం, భూక్య పాండు, పి హుస్సేన్, బాలు నాయక్, వెంకటచంద్ర, శీలం శ్రీను, సోమయ్య, వెంకటనారాయణ, యోన, మురళి, సైదయ్య, భిక్షం, నరసింహచారి, వీరస్వామి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సాగర్ కాల్వపై ఉన్న మోటార్లు తొలగించాలి

నడిగూడెం : నాగార్జునసాగర్ ఎడమకాల్వ కట్టపై రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను వెంటనే తొలగించాలని ఎస్ఐ గండమళ్ల అజయ్‌కుమార్ రైతులను కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత మాసంగి సీజన్ వరికోతలు పూర్తయ్యాయని, కట్టపై ఉన్న మోటార్లు చోరీకి గురయ్యే అవకాశముందన్నారు. సంబంధిత రైతులు తక్షణమే మోటార్లను తొలగించుకోవాలన్నారు.

ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవాలి

గరిడేపల్లి : ఉపాధిహామీ పథకం ద్వారా పొలాలకు వెళ్లే దారుల నిర్మాణ పనులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్బీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనుల కింద చేపట్టిన ఆర్సీపీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ సురేష్, చిరంజీవి, సామల వెంకట్‌రెడ్డి, వనజ, శివ, ఫీల్డ్‌అసిస్టెంట్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

నడిగూడెం : మండలంలోని ఎకలాస్‌ఖాన్‌పేట తండా గ్రామానికి చెందిన వాంకుడోతు గణేష్ ఖమ్మంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతూ 467మార్కులు పొంది ఖమ్మం జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో బంజారా నాయక్ సంఘం ఆధ్వర్యంలో గణేష్‌ను అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో రామునాయక్, శ్రీకాంత్, నాగరాజు, సైదులు, లింగానాయక్ పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

నేరేడుచర్ల : మండలంలో రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను గురువారం గ్రామాల్లో పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు అందుబాటులో ఉండాలన్నారు.

ఉపేందర్‌నాయుడికి ఘన సన్మానం

మోతె : మండలంలోని నామవరం గ్రామానికి చెందిన కంచర్ల ఉపేందర్‌నాయుడిని బుధవారం ఎంఈఓ కె.గోపాల్‌రావు ఘనంగా సన్మానించారు. నామవరం ప్రభుత్వ పాఠశాలల్లో రూ.18లక్షలతో ఆతడి తండ్రి జ్ఞాపకార్థంగా 7, 8తరగతి గదులను నిర్మించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు కొత్తపల్లి రాంరెడ్డి, సుధీర్, మురళి, సురేష్, మల్లయ్య, కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమైన చర్య



మఠంపల్లి : కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

హుజూర్‌నగర్ : కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి అత్యంత హేయమైన చర్య అని జనసేన నాయకులు సైదులుయాదవ్, హుస్సేన్‌మియా అన్నారు. ఉగ్రదాడుల్లో మరణించిన వారికి బుధవారం పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దాడికి పాల్పడిన వారు త్వరలో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, గోపి మహేష్, రవి, ఆదిత్య, చారి, అల్లాఉద్దీన్ ఉన్నారు.

నేరేడుచర్లలో కొవ్వొత్తులతో ప్రదర్శన

నేరేడుచర్ల : జమ్ముకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో మరణించిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బుధవారం పట్టణంలో మాతరం యూత్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఉగ్రదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కొణతం సత్యనారాయణరెడ్డి, ఆకారపు వెంకటేశ్వర్లు, సురేష్, రాపోలు నవీన్, భాస్కర్, నాగరాజు, నరేందర్‌రెడ్డి, కొణతం నాగిరెడ్డి, సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, ధనుంజయనాయుడు, సీతారాంరెడ్డి, శేఖర్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, సత్యనారాయణ, శ్రీనివాస్, మధు, శంకర్‌రెడ్డి, గోవింద్, మధు, శ్రీరాములు, రవీందర్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, నాగేశ్వర్‌రావు, వెంకట్ ఉన్నారు.

మఠంపల్లి : కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటశివ యాదవ్, నాయకులు బొగ్గవరపు రాధాకృష్ణ, మట్టపల్లి శ్రీమన్నారాయణ, గుర్రం మట్టారెడ్డి, పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో నివాళులర్పించి మాట్లాడుతున్న జనసేన నాయకులు



నేరేడుచర్ల : కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి



చిలుకూరు : సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు : కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతరాంపురం గ్రామంలో నిర్వహించిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు కేంద్రాల వద్ద ధాన్యం ఎండబోసి రోజులు గడుస్తున్నా కాంటాలు వేయడం లేదన్నారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో వెంటనే ధాన్యం కాంటాలు వేయాలని డిమాండ్ చేశారు. పేదల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ కృషి చేస్తుందన్నారు. అనంతరం పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా కనకం రుద్రయ్య, సహాయ కార్యదర్శిగా పుట్టపాక రవి, కమిటీ సభ్యులుగా బాలేబోయిన గురవయ్య, సాతులూరి అలివేలు, గన్నా వెంకటేశ్వర్లు, పిల్లుట్ల చంద్రయ్య, తోడేటి కోటయ్య, పార్వతమ్మ ఎన్నికయ్యారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నేరేడుచర్ల : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు సందర్శించారు. అనంతరం రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతూ తహసీల్దార్ సురిగి సైదులుకు వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. నాలుగు రోజులుగా ధాన్యం సేకరణ చేయడం లేదని, వర్షానికి ధాన్యం తడిసి అక్కడక్కడ మొలకెత్తుతుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే డబ్బులను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, శావయ్య, రైతులు ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



సమ్మె కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

మునగాల : మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ రైస్‌మిల్లు ఆవరణలో నిర్వహించిన మునగాల రైస్‌మిల్ హమాలీ కార్మికుల సమావేశంలో వారు పాల్గొని సమ్మె కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడారు. మండలంలో అన్ని కూడళ్ల వద్ద, రైస్‌మిల్లుల ఆవరణలో, సంస్థలు, అడ్డాల వద్ద అన్ని రంగాలకు చెందిన కార్మికులు మే 01న జెండాలు ఎగురవేసి మేడే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మిక వ్యతిరేఖ నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మే 20న అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్‌టీయూ మున్సిపల్ యూనియన్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరెంపుల వెంకటాద్రి, బీఆర్‌టీయూ హమాలీ యూనియన్ నాయకులు రేసు సైదులు, సోమయ్య, మండల హమాలీ యూనియన్ నాయకులు సోము అప్పయ్య, లొడంగి సత్యం, చింతకాయల లింగయ్య, దేశగాని లింగయ్య, కోల నర్సింహారావు, వెంకటరెడ్డి, చంద్రయ్య, వీరస్వామి, కుటుంబరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మేళ్లచెరువు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి కె.వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, రాగిజావ వంటి వాటితో పాటు పాఠశాలలో డిజిటల్ బోర్డుల ద్వారా విద్యాబోధన, సైన్స్ ల్యాబ్, విశాలమైన క్రీడా స్థలం, క్రీడా పరికరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి చదువుతో పాటు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

హుజూర్‌నగర్ : ఈ నెల 25న జరగనున్న హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. ఈ ఎన్నికల్లో మొత్తం 30మంది అభ్యర్థులు వివిధ స్థానాలకు పోటీ చేయగా 8మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 22మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు ఎంఎస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్య తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

కోదాడరూరల్ : మద్యంతాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఓ వ్యక్తికి జరిమానాతో పాటు ఒక్క రోజు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. పట్టణంలో మంగళవారం రాత్రి రంగా థియేటర్ సెంటర్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరు పరచగా జడ్జి ఒకరికి రూ.2వేల జరిమానాతో పాటు ఓ రోజు జైలుశిక్ష, మరొకరికి రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

పండ్లకు మద్దతు ధర ప్రకటించాలి

నడిగూడెం : పండ్లకు మద్దతు ధర ప్రకటించాలని పండ్ల తోటల రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని రామాపురంలో ఆయన మామిడి తోటలను పరిశీలించి మాట్లాడారు. గత కొద్ది సంవత్సరాలుగా ప్రకృతి వైపరీత్యాల వలన మామిడి, బత్తాయి, నిమ్మ పంటలను సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కాసిన కొద్ది పంటకు మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో దళారులను ఆశ్రయిస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పండ్ల తోటల రైతులందరికీ బీమా సౌకర్యం, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

మే డే ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి

గరిడేపల్లి : కార్మికులందరూ మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని సీఐటీయూ అనుబంధ సంస్థ భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు కోరారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా మే డే వేడుకలను ప్రతి కార్మికుడు జరుపుకోవాలని కోరారు. సమావేశంలో సభ్యులు కనకయ్య, నాగరాజు, పుల్లయ్య, సైదులు, వీరేందర్, మహేష్, కృష్ణ, ఎస్‌కె. ఖాదర్, నారాయణ, సూరిబాబు, జాను, భిక్షం, రామయ్య తదితరులు పాల్గొన్నారు.